



RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 87


పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

మంగళవారం 1 సెప్టెంబర్ 2026

## భగీరథ ప్రయత్నంతో కరవు సీమకు కృష్ణమ్మ

- 30 ఏళ్ల కల సాకారం..వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ప్రారంభించిన సీఎం
- నల్లమల కొండల్ని చీల్చుకుని నల్లమల సాగర్‌కు కృష్ణమ్మ పరుగు
- తొలిదశతో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు.. 4 లక్షల మందికి తాగునీరు
- సీఎం చంద్రబాబు ప్రసంగం









**మార్కాపురం,కలంకౌంటర్ :** మూడు దశాబ్దాలుగా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలు ఎదురు చూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారమైంది. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేశారు. దోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద నల్లమల కొండల్లోని జంట సొరంగాల నుంచి వెలువడిన కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, జల హారతి ఇచ్చి స్వాగతించారు. అనంతరం ప్రాజెక్టు తొలిదశ ప్రారంభోత్సవానికి సూచికగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కరవునేలను తాకిన కృష్ణా జలాలకు ముఖ్యమంత్రి సాష్టాంగ నమస్కారం చేశారు. శ్రీశైలం జలాశయంలోని కొల్లం వాగు నుంచి గ్రావిటీ ద్వారా తరలించిన కృష్ణా జలాలు వెలిగొండ జంట సొరంగాల మీదుగా గంటవానిపల్లె అక్విడెక్టుకు చేరుకుని నల్లమల సాగర్ వైపు పరుగులు తీశాయి. నల్లమల కొండలను చీల్చుకుని



కాలువల్లో ప్రవహించిన కృష్ణమ్మకు స్థానిక మహిళలు, ప్రజలు పుష్పాలతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం పవిత్ర జలాలను సీఎం చంద్రబాబు మంత్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులపై స్వయంగా చల్లారు. అక్విడెక్టు వద్ద రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి స్విచ్ నొక్కి జలాలను దిగువకు వదిలారు. **30 ఏళ్ల క్రితం భూమిపూజ.. నేడు ప్రారంభం..** వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం తన జీవితంలో భావోద్వేగ సందర్భమని చంద్రబాబు పేర్కొన్నారు. 1996 మార్చి

- 2లో

## పరిశ్రమలన్నీ 33 శాతం పచ్చదనాన్ని పాటించాలి

- రేపటి తరాలకు పచ్చని భవిష్యత్తును అందించేందుకు సహకరించాలి
- పారిశ్రామిక వర్గాలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు



**విజయవాడ, కలంకౌంటర్ :** రాష్ట్ర ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమైనదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను తు.చ. తప్పక పాటించాలని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలని కోరారు. పరిశ్రమల పరిసరాల్లో మొక్కలు నాటడం ద్వారా వాయు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించవచ్చని పవన్ కళ్యాణ్ తెలిపారు. భా వితరాలకు ఆరోగ్య కరమైన, స్వచ్ఛమైన, పచ్చని భవిష్యత్తును అందించడం మనం దరి బాధ్యత అని పేర్కొ న్నారు. పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ముందుకు రావాలని సూచించారు. అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణలను సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా సమాజానికి, ప్రకృతికి, రాబోయే తరాలకు విలువైన భవిష్యత్తును అందించగలమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రకాల పరిశ్రమలు 33 శాతం పచ్చదనం నిబంధనను కచ్చితంగా అమలు చేసేలా కాలుష్య నియంత్రణ మండలి, ఏపీ–గ్రీన్ సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 2026 గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా పోర్టులు, సిమెంట్, మైనింగ్, ఎనర్జీ, ఆహార శుద్ధి, ప్లాస్టిక్, పేపర్, వస్త్రాలు తదితర రంగాలకు చెందిన సుమారు 3,400 పరిశ్రమలు, కంపెనీలు వేలాది ఎకరాల విస్తీర్ణంలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 14 రోజుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, తొలి విడతగా పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రవ్యాప్తంగా 26 పరిశ్రమల్లో 129 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన పరిశ్రమల యాజమాన్యాలను పవన్ కళ్యాణ్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పరిశ్రమలు 33 శాతం పచ్చదనం లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. ముఖ్యంగా విశాఖపట్నం వంటి నగరాలకు సమీపంలో ఉన్న పరిశ్రమలు ఈ నిబంధనను కచ్చితంగా అమలు చేసి, పట్టణ ప్రజలు కాలుష్య ప్రభావానికి గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీ సిటీ, పరవాడ తదితర ప్రాంతాల్లోని ప్రత్యేక ఆర్థిక మండలాలు కూడా 33 శాతం పచ్చదనాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనాన్ని సాధించాలన్న మహత్తర సంకల్పంలో పారిశ్రామిక వర్గాలు చురుకుగా భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు

## రెండ్రోజుల పాటు పులివెందులలో జగన్ పర్యటన

- సెప్టెంబర్ 1, 2 తేదీల్లో వైఎస్ జగన్ పులివెందుల పర్యటన
- వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొననున్న జగన్
- ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద తండ్రికి నివాళులు
- పర్యటనలో భాగంగా ప్రజలకు అందుబాటులో ఉండనున్న మాజీ సీఎం



**విజయవాడ, కలంకౌంటర్ :** వైసీపీ అధినేత జగన్ తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో ఈ పర్యటన జరగనుంది. దివంగత మాజీ ముఖ్యమంత్రి, తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో జగన్ పాల్గొననున్నారు. పర్యటన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 1వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు జగన్ పులివెందుల చేరుకుంటారు. అనంతరం భాకరాపురంలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. ఆ రోజు రాత్రికి పులివెందులలోని తన నివాసంలోనే బస చేస్తారు. ఇక సెప్టెంబర్ 2వ తేదీన ఉదయం పులివెందుల నివాసం నుంచి బయలుదేరి 7:45 గంటలకు ఇడుపులపాయ చేరుకుంటారు. అక్కడ వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, తండ్రి సమాధి వద్ద నివాళు లర్పిస్తారు. వర్ధంతి కార్యక్రమం పూర్తయిన అనంతరం జగన్ అక్కడి నుంచి తిరుగు ప్రయాణమవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రతీ ఏటా వైఎస్సార్ వర్ధంతి, జయంతి కార్యక్రమాలకు జగన్ హాజరై నివాళులు అర్పించడం తెలిసిందే.

## రాజకీయ విలువలకు మానవ రూపం రోశయ్య

- రోశయ్య విగ్రహం 'ది స్టాట్యూ ఆఫ్ స్టేట్స్‌మన్'గా నిలవాలి
- ఆయన జీవిత చరిత్ర తెలిసేలా మ్యూజియం ఏర్పాటుచేయాలి
- విశాఖలో మాజీ సీఎం కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేష్





**విశాఖపట్నం, (సిరిపురం సర్కిల్:),కలంకౌంటర్ :** రాజకీయ విలువలకు మానవ రూపం, నిజాయతీకి నిలువెత్తు ప్రతిరూపం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య . విశాఖపట్నంలోని సిరిపురం సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన రోశయ్య కాంస్య విగ్రహాన్ని మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ...


**'ది స్టాట్యూ ఆఫ్ స్టేట్స్‌మన్'..**"యువగళం పాదయాత్రలో ఆర్యవైశ్యులు మా ఆత్మగౌరవాన్ని గౌరవించాలని కోరారు. అందుకే తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకైన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని అమరావతిలో రికార్డు సమయంలో ఏర్పాటు చేసుకున్నాం. అది ఒక చరిత్ర. భూమి మేం ఇచ్చాం. నిధులు ఆర్యవైశ్య సోదరులే సమకూర్చి ఏర్పాటు చేశారు. మీరు కోరుకుంటే ఐక్యతతో నిలబడతారనే దానికి ఇది నిదర్శనం. ఇప్పుడు విశాఖపట్నంలో రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం కూడా చరిత్రలో నిలిచిపోయే రోజు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య పెద్దల ఆమోదంతో 'స్టాట్యూ ఆఫ్ సాక్రిఫైస్' అని పేరు పెట్టుకున్నాం. అదే విధంగా రోశయ్య విగ్రహాన్ని చూసిన వెంటనే గుర్తొచ్చే పదం 'స్టేట్స్‌మన్'. అందుకే ఈ విగ్రహాన్ని 'ది స్టాట్యూ ఆఫ్ స్టేట్స్‌మన్' అని పిలుద్దాం" అని ప్రతిపాదించారు.

**వ్యక్తిగత విభేదాలకు దూరం.. రాజకీయ విలువలకు ప్రతిరూపం..** "రాజకీయ విలువల గురించి మాట్లాడాలంటే గుర్తొచ్చే పేర్లలో రోశయ్య ఒకరు. నాకు ఎంతో ఇష్టమైన నాయకుడు, గొప్ప స్టేట్స్‌మన్ రోశయ్య . క్రమశిక్షణ, నిజాయతీ, సబ్జెక్టుపై పట్టు, మాటల్లో మంచితనం, విమర్శల్లో పదును ఆయన ప్రత్యేకతలు. పదవులు శాశ్వతం కాదు.. ప్రజలకు చేసిన సేవే శాశ్వతం అని నమ్మిన వ్యక్తి రోశయ్య . అధికారం ఉన్నప్పుడు అహంకారం ఉండదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉండేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో రోశయ్య మాట్లాడుతుంటే అందరూ సైలెంట్‌గా వినేవారు. ప్రభుత్వం, ప్రతిపక్షం మధ్య ఒక వారధిగా ఉండేవారు. చంద్రబాబు , వైఎస్సార్ మధ్య ఎప్పుడైనా వాడివేడిగా వాదన జరిగినప్పుడు రోశయ్య నిలబడి కాస్త చల్లబరిచేవారు. మరుసటి రోజు బాబుకి ఫోన్ చేసి 'చాలా చక్కగా వాదనలు జరిగాయి.. ఇవాళ చర్చ కొనసాగిద్దాం' అని చెప్పేవారు. రాజకీయ విభేదాలు ఉన్నా వ్యక్తిగత గౌరవాన్ని కాపాడిన నాయకుడు రోశయ్య అని అన్నారు.

**నేటి తరానికి ఆయనే స్ఫూర్తి..** "ఒక పల్లెటూరిలో సాధారణ కుటుంబంలో పుట్టారు. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకుండా ఆచార్య ఎన్.జి. రంగా శిష్యుడిగా రాజకీయాల్లోకి వచ్చారు. పల్లెటూరు నుంచి ఢిల్లీ వరకు ఎదిగిన గొప్ప వ్యక్తి రోశయ్య . కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ముఖ్యమంత్రులు మారినా ప్రతి కేబినెట్‌లో రోశయ్య కొనసాగేవారు. మొదటి నుంచి చివరి వరకు కాంగ్రెస్ పార్టీలోనే ఉండి కమిట్మెంట్‌తో పనిచేశారు. ఆస్తులు, రాజకీయ నేపథ్యం లేకపోయినా కష్టం, క్రమశిక్షణ, విలువలు ఉంటే రాజకీయాల్లో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని రోశయ్య నిరూపించారు. ఆయన ఒక రాజకీయ పాఠశాల. నేటి తరానికి ఆయనే స్ఫూర్తి" అని అన్నారు.

**భావి తరాలకు ఆయన జీవిత చరిత్ర తెలియాలి..** "విగ్రహాలు కట్టడం వలన ఏం ఉపయోగమని చాలా మంది అపోహ పడుతుంటారు. కానీ నేను యువగళం పాదయాత్ర చేసే సమయంలో తెలుగుజాతి కోసం త్యాగాలు చేసిన ఎందరో మహానుభావుల గురించి వారి విగ్రహాలను చూసే తెలుసుకున్నాను. గొప్ప వ్యక్తులకు విగ్రహాలు ఏర్పాటు చేయడం గొప్ప నివాళి. అయితే అక్కడితో ఆగకూడదు. వారి

2లో



# రాజకీయ విలువలకు మానవ రూపం రోశయ్య







(మొదటిపేజీ తరువాయి)

జీవిత చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాలి. రోశయ్య జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు, నష్టాలు, విజయాలు నేటి తరాలకు తెలియాలి. ఆయన జీవిత చరిత్రపై పుస్తకాలు, ప్రత్యేక వీడియోలు రూపొందించి యువతకు చేరువ చేయాలి. వీటితోపాటు రోశయ్య జీవిత చరిత్ర తెలిపేలా ఒక మ్యూజియం ఏర్పాటు చేయాలి. ఆర్యవైశ్య పెద్దలంతా కలిసి ఆలోచించి మ్యూజియం కోసం స్థలం ఏర్పాటుచేయండి. కేవలం 18 నెలల్లో మ్యూజియం పూర్తి చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా దేశానికి అంకితం చేద్దాం. నేటి తరానికి కూడా బాల్యం నుంచే రోశయ్య జీవిత చరిత్ర తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అందుకే పాఠ్యాంశాలలో ఆయన జీవిత చరిత్ర, రాజకీయ విలువలు, సమాజ సేవ గురించి ఒక అధ్యాయం పెట్టించే బాధ్యత నాది. అలానే ఆయన అవలంబించిన రాజకీయ విలువలపై టీడీపీ క్యాడర్ ట్రైనింగ్‌లో కూడా ఒక చాప్టర్ పెట్టించే బాధ్యత పల్లా శ్రీనివాసరావుది. ప్రభుత్వం, ఆర్యవైశ్య పెద్దలు కలిసి రోశయ్య జీవితాన్ని భవిష్యత్ తరాలకు అందించేలా కృషి చేద్దాం" అని పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందని, ఇంతటి గొప్ప వ్యక్తి విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం నాకు దక్కడం నా అదృష్టంగా భావిస్తున్నాని ఆయన అన్నారు. విగ్రహావిష్కరణకు ముందు రోశయ్య కుటుంబసభ్యులు పైడా కృష్ణ ప్రసాద్, పైడా రమాదేవి, పైడా మౌర్య, కొణిజేటి శివసుబ్బారావు, కేఎస్ఎన్ మూర్తిలతో మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సమాజ శ్రేయస్సు కోసం రోశయ్య చేసిన త్యాగాలు, అందించిన సేవలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహకారం అందిస్తామని కుటుంబసభ్యులకు మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఏపీ ఆర్యవైశ్య కార్పోరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## డీఎస్పీ కార్యాలయానికి సిమెంట్ బెంచీల వితరణ




**కావలి,కలంకౌంటర్ :** కావలి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఉప పోలీసు సూపరింటెండెంట్ (డీఎస్పీ) కార్యాలయ ప్రాంగణంలో ప్రజల సౌకర్యార్థం రెండు సిమెంట్ బెంచీలను ఆదివారం అందజేశారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షురాలు స్వర్ణలత, రోటేరియన్ ఎం.వి.ఎస్.ఎస్.వి. ప్రసాద్ దంపతులు తల్లిదండ్రులైన మద్దెల రామరాఘవయ్య, స్వరాజ్యలక్ష్మిల జ్ఞాపకార్థం సొంత నిధులతో వీటిని విరాళంగా సమకూర్చారు.

## బాధితుల సమస్యలను పరిష్కరించాలి - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్




**విజయనగరం,కలంకౌంటర్ :** విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ సిస్టం) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు. పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ 35 ఫిర్యాదులను స్వీకరించారు. ఆయా ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 20, కుటుంబ కలహాలకు సంబంధించినవి 4, మోసాలకు పాల్పడినట్లు 3, ఇతర అంశాలకు సంబంధించినవి 8 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలపై చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, 7దినాల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను నివేదిక రూపంలో జిల్లాపోలీసు కార్యాలయానికి పంపాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ ఆదేశించారు. ??ఈ కార్యక్రమంలో డి.సి.ఆర్.బి. సిఐ కే.కుమార స్వామి, ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వెలిగొండ ప్రాజెక్టు వద్ద కృష్ణా నీళ్లను నెత్తిన చల్లుకుని, బాటిళ్లతో పట్టుకెళ్లిన జనం

**మార్కాపురం,కలంకౌంటర్ :** అది కేవలం నీటి ప్రవాహం కాదు, దశాబ్దాలుగా కరవు నేల చూస్తున్న కల సాకారమైన క్షణం. అందుకే, పరుగులు పెడుతున్న కృష్ణమ్మను చూసి అక్కడికి వచ్చిన జనం కేవలం కేరింతలు కొట్టడమే కాదు, ఆ నీటిని చేతులతో తాకి భక్తితో కళ్లకద్దుకున్నారు. ఎంతో పవిత్రంగా భావిస్తూ తలపై చల్లుకున్నారు. కొందరైతే తాము తెచ్చుకున్న బాటిళ్లలో ఆ పుణ్య జలాలను నింపుకుని ఇళ్లకు పట్టుకెళ్లారు. మార్కాపురం జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా కనిపించిన ఈ దృశ్యం, ఆ ప్రాంత ప్రజల గుండెల్లో కృష్ణా జలాలకు ఉన్న స్థానాన్ని, వారి నిరీక్షణ తీవ్రతను చెప్పకనే చెప్పింది. దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1ను ప్రారంభించారు. ఫీడర్ కెనాల్ గేట్లు ఎత్తి నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేయడంతో ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా జల సంబరంతో పులకించింది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ కల కళ్లముందే ప్రవాహమై పరుగులెడుతుంటే, అక్కడికి తరలివచ్చిన రైతులు, మహిళలు, ప్రజల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

## డేటా అనలటిక్స్‌తో మరింత సమర్ధంగా పౌర సేవలు

● ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలపై విస్తృత ప్రచారం ● ప్రజల భాగస్వామ్యంతోనే సానుకూల ఫలితాలు ● రియల్ టైమ్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



**అమరావతి,కలంకౌంటర్ :** ప్రజలు వ్యక్తం చేసే అభిప్రాయాల ఆధారంగా ప్రభుత్వ శాఖలు అందిస్తున్న పౌరసేవలు మరింత మెరుగుపరచాలని, మార్పులు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్ పై సీఎం సమీక్ష నిర్వహించారు. వెలిగొండ, అల్లూరి విమానాశ్రయ ప్రారంభోత్సవం లాంటి కార్యక్రమాలకు ప్రజల భాగస్వామ్యం పెద్దఎత్తున వచ్చిందని... దీనిని ఇతర అంశాలకూ వర్తింప చేయాలని సీఎం సూచించారు. ప్రత్యేకించి మహిళలపై నేరాలు, గంజాయి నియంత్రణ సహా వివిధ అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎం సూచించారు. ఇప్పటివరకు స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో తాను 20 సార్లు పాల్గొన్నానని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో పరిశుభ్రత అంశాలపై ప్రజల్లో మరింత లోతైన అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో శానిటేషన్ నిర్వహించే విషయంలో ఎలాంటి రాజీ లేదని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. సంక్షేమ హాస్టళ్లలో మెరుగ్గా శానిటేషన్ నిర్వహించాలని నిర్దేశించారు. ప్రతీ నెలా మొదటి ఆదివారం రోజున విద్యార్థుల తల్లిదండ్రుల్ని ఆహ్వానించి హాస్టళ్లలో పరిస్థితులు, ఆహారం, తాగునీరు తదితర అంశాలపై వివరించాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్నా క్యాంటీన్ల ద్వారా దాతలు అన్నార్తులకు సాయం అందించే అంశాన్ని కూడా గుర్తించాలని పేర్కొన్నారు. జిల్లాల వారీగా, నియోజకవర్గాల వారీగా ఎప్పటికప్పుడు సమీక్షించుకుని లోటు పాట్లను సవరించుకోవాలని సీఎం నిర్దేశించారు. బాధ్యులకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో ర్యాంకులు ఇవ్వాలని స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి అయ్యి కృష్ణా నది జలాలు రావటంతో ప్రజల్లో ఎంతో ఆనందం వ్యక్తమైందని.. ప్రతీ కార్యక్రమంలోనూ ప్రజల భాగస్వామ్యంతో నిర్వహిస్తే సానుకూల ఫలితాలు వస్తాయన్నారు.

**ఆన్ లైన్ సేవలు మరింత విస్తృతం..** అన్ని ప్రభుత్వ శాఖలూ ఆన్ లైన్ లో సేవలు అందించాలని సమీకృత సేవల విధానం ద్వారా తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. రెవెన్యూ సహా వివిధ విభాగాలు అన్ని ధృవపత్రాలనూ ఆన్ లైన్ లో జారీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అవేర్ ద్వారా రాష్ట్రంలో సాగు స్థితిపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి రైతులకు సూచనలు జారీ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రకృతి సేద్యం పెంచేందుకు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని స్పష్టం చేశారు. ఉద్యాన పంటలు కాపాడుకోడానికి ప్రస్తుతం ఉన్న నీటి వనరుల్ని సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు. భూమిని నిరుపయోగంగా ఉంచకుండా సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. 5.70 లక్షల ఎకరాల్లో ప్రతీ ఎకరాను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే దరఖాస్తుల పరిష్కారంపై కూడా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఈ సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరు అయ్యారు.

## మధ్య వర్తిత్వముతో పెండింగ్ కేసులు పరిష్కారం-లోక్ అదాలత్ మాలకొండ రెడ్డి



**కావలి,కలంకౌంటర్ :** కోర్టుల్లో మధ్యవర్తుత్వం ద్వారా పెండింగ్ కేసులను త్వరగాపరిష్కరించుకోవచ్చు అని కావలి లోక్ అదాలత్ సభ్యులు ముడిగండ్ల మాలకొండ రెడ్డి పేర్కొన్నారు. కోర్టుల్లో కేసులు అనేక కారణాలతో ఏళ్ల తరబడి పేరుకు పోతున్నాయని వాటిని త్వరగా పరిష్కారణకు సమయం, నగదు వృధాను అరికట్టేందుకు ఈ మధ్యవర్తుత్వం కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతు ఒదని తెలిపారు. కక్షిదారులు ఈ మధ్యవర్తత్వంపై అవగాహన పెంచుకొని సత్వర న్యాయం పొందటానికి అవగాహన పెంచుకోవాలని కోరారు.

# భగీరథ ప్రయత్నంతో కరవు సీమకు కృష్ణమ్మ

● 30 ఏళ్ల కల సాకారం..వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ప్రారంభించిన సీఎం ● నల్లమల కొండల్ని చీల్చుకుని నల్లమల సాగర్‌కు కృష్ణమ్మ పరుగు ● తొలిదశతో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు.. 4 లక్షల మందికి తాగునీరు ● సీఎం చంద్రబాబు ప్రసంగం

(మొదటిపేజీ తరువాయి)

5న ముఖ్యమంత్రిగా తానే ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేశానని, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత 2026 ఆగస్టు 31న ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభిస్తున్నానని చెప్పారు. సీఎం మాట్లాడుతూ.. "ఆ రోజు చేసిన సంకల్పం.. ఈ రోజు నల్లమల సాగర్‌లో జలసిరిగా మారింది. ఇది భగీరథ ప్రయత్నం. కొండలు అడ్డు వచ్చినా తొలిచి ముందుకు వెళ్లాం. కరువు నేలకు కృష్ణమ్మను తీసుకొచ్చాం. శ్రీశైలం మల్లన్న సన్నిధి నుంచి బయలుదేరిన కృష్ణమ్మ.. మార్కాపురం చెన్న కేశవుడు కొలువైన నేలకు జలహారతి ఇస్తోంది. ప్రజలు ఇచ్చిన తీర్పుతోనే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించుకుని జల సిరులతో ఈ ప్రాంత అభివృద్ధికి రెక్కలు తొడిగాం. వెలిగొండ బంగారు కొండ అవుతుంది. ఈ ప్రాంత ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుంది. మాట ఇచ్చాం.. ప్రాజెక్టు పూర్తి చేసి కృష్ణమ్మను తరలించాం. ఇక సంపద సృష్టిస్తాం. మార్కాపురం గడ్డకు, కరువుతో పోరాడిన రైతన్నలకు, ఫ్లోరైడ్ బాధలు భరించిన కుటుంబాలకు, నీటి కోసం ఎదురు చూసి అలసిపోయిన తరాలకు కృష్ణా జలాలతో కొత్త ఊపిరి ఇస్తున్నాం."అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**నిర్వాసితుల త్యాగాలకు పాదాభివందనం...** వెలిగొండ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, గ్రామాలను త్యాగం చేసిన 11 గ్రామాల ప్రజలకు పాదాభివందనం చేస్తున్నానని సీఎం అన్నారు. రైతుల త్యాగం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. "ప్రాజెక్టు వల్ల లబ్ధి పొందేవారు ఎంత సంతోషంగా ఉంటారో.. నిర్వాసితులు కూడా అంతే సంతోషంగా ఉండాలి. కేవలం 48 రోజుల్లో 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల పరిహారం అందించాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నిర్వాసితుల బాధలు, అవసరాలను గుర్తించి అదనంగా మరో రూ.169 కోట్లు చెల్లిస్తున్నాం. కటాఫ్ తేదీని పెంచి 18 ఏళ్లు నిండిన యువతకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున అందించాం. రూ.10,200 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టులో ఇప్పటివరకు రూ.7,983 కోట్లు ఖర్చు చేసి మొదటి దశను పూర్తి చేశాం. 18.8 కిలోమీటర్ల మేర జంట సొరంగాలు, 21.8 కిలోమీటర్ల ఫీడర్ కాలువల పనులు పూర్తి అయ్యాయి. తొలిదశలో భాగంగా నల్లమల సాగర్‌కు 10.70 టీఎంసీల నీటిని తరలిస్తాం. 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందుతుంది. వెలిగొండ పూర్తయితే ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుతుంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 3.36 లక్షల ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 84 వేల ఎకరాలు, కడప జిల్లాలో 27 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. తీగలేరు కాలువ కింద 62 వేల ఎకరాలు, గొట్టిపడియ కాలువ కింద 9,500 ఎకరాలు, తూర్పు ప్రధాన కాల్వ కింద 3.70 లక్షల ఎకరాల ఆయకట్టు సుస్థిరం అవుతుంది. కృష్ణమ్మ రాకతో పశ్చిమ ప్రకాశంలో ఫ్లోరైడ్ అనే పదం గత చరిత్రగా మిగిలిపోతుంది. వెలిగొండ అంటే ఫ్లోరైడ్ కష్టాలకు ముగింపు. కరువు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర." అని ముఖ్యమంత్రి అభివర్ణించారు.



**వెలిగొండకు 2019లో గ్రహణం.. 2024లో విముక్తి..** "2019లో గొడ్డలి పార్టీ అధికారంలోకి రావడంతో వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. విలువైన నిర్మాణ కాలాన్ని వృథా చేశారు. నిర్వాసితుల కోసం జీవో ఇచ్చి అరకొరగా చెల్లింపులు చేశారు. ఎన్నికలకు నెల రోజుల ముందు ప్రాజెక్టును పూర్తి చేశామని చెప్పడం, రూ.4 వేల కోట్ల పనులు పెండింగ్‌లో ఉండగానే జాతికి అంకితం చేశామని ప్రకటించడం ప్రజలను మోసం చేయడమే. ఫేక్ డ్రామాలు, సినిమా సెట్టింగులతో ప్రజల్ని, రైతుల్ని మోసం చేసిన వ్యక్తుల్ని ఏం చేయాలి. రెండు సొరంగాలు మొత్తం తిరిగానని చెప్పుకుంటున్న వ్యక్తులు ఈ ప్రాజెక్టు నుంచి నీళ్లు ఎందుకు ఇవ్వలేదు. పనులు చేసేశామని చెప్పి బుకాయించటం తప్పు. ఫేక్ మాటలు చెప్పే వ్యక్తుల్ని, మోసం చేసిన వారి గురించి ఈ ప్రాంత ప్రజలు నిలదీయాలి. గొడ్డలి పార్టీ హయాంలో సొరంగాల్లో టీబీఎం యంత్రం ఇరుక్కు పోవడంతో పనులు పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే సమస్యలను పరిష్కరించి పనులు పూర్తి చేసి ఇప్పుడు కృష్ణా జలాలను అందించింది. చరిత్రను ఎవరూ తిరగ రాయలేరు. ఫేక్ ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొడతాం. చెడును ఖండించాలి. మంచి చేసిన ప్రభుత్వానికి అండగా ఉండాలి."అని సీఎం వ్యాఖ్యానించారు.


**మార్కాపురంలోనూ 2028 కృష్ణా పుష్కరాలు..** వెలిగొండ ప్రాజెక్టు మొత్తం పూర్తికావడానికి మరో రూ.1,900 కోట్ల పనులు చేయాల్సి ఉందని చంద్రబాబు తెలిపారు. వెలిగొండ ఫేజ్-2ను కూడా 2028 నాటికి పూర్తి చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశామని, రాయలసీమ హార్టికల్చర్ హబ్‌లో మార్కాపురాన్ని భాగం చేశామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతాన్ని సమానంగా అభివృద్ధి చేయడమే ఎన్డీఏ విధానమని, రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి సాధిస్తామని స్పష్టం చేశారు. దేశం ఎదుర్కొంటున్న నీటి సమస్యలకు నదుల అనుసంధానమే పరిష్కారమని చంద్రబాబు అన్నారు. పోలవరం రాష్ట్రానికి జీవనాడి అని, 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని చెప్పారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తరలిస్తున్నామని, తదుపరి వంశధార వరకూ తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దక్షిణ భారతదేశంలో గోదావరి-కావేరి అనుసంధానం జరగాలని, మహానది-గంగానదులను అనుసంధానిస్తే దేశం సుభిక్షంగా మారుతుందని ఆకాంక్షించారు. వచ్చే మూడేళ్లలో 36 ప్రాజెక్టులను పూర్తి చేసేలా ఇరిగేషన్ క్యాలెండర్ రూపొందించామని చెప్పారు. ప్రతి వర్షపు నీటి చుక్కను పొదుపు చేసి భూగర్భజలంగా మార్చుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 2028లో జరిగే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలోనూ వైభవంగా నిర్వహించుకుందామని చంద్రబాబు అన్నారు. గోదావరి జలాలు నల్లమల సాగర్ వరకూ రావాలని, అందుకోసం ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని తెలిపారు. ఓట్లు ఆశించి కాదు.. మార్పు ఆశించి పనిచేస్తున్నామని.. ఎన్నికల కోసం కాదు.. ప్రజల జీవితాలను మార్చేందుకు, భవిష్యత్ తరాల అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని సీఎం స్పష్టం చేశారు.

**సంప్రదాయ పంచెకట్టుతో ఉల్లాసంగా..** తెలుగు సంప్రదాయ పంచె కట్టుతో వెలిగొండ సొరంగాల ద్వారా వచ్చిన కృష్ణా జలాలకు జల హారతి ఇచ్చారు. కృష్ణా జలాలు పసుపు కుంకుమలు చల్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పవిత్ర జలాలను మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులపై చల్లి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఫీడర్ కాలువ వద్ద కృష్ణమ్మ ప్రవాహానికి ముఖ్యమంత్రి సాష్టాంగ నమస్కారం చేశారు. సంప్రదాయ నృత్యాలతో కృష్ణా జలాలకు గిరిజన మహిళలు సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. బహిరంగ సభా వేదికపై ఏర్పాటు చేసిన ర్యాంపుపై కండువా తిప్పుతూ రైతులకూ, ప్రజలకూ ముఖ్యమంత్రి అభివాదం చేశారు. దివంగత పూలసుబ్బయ్య కుటుంబ సభ్యుల్ని ఆత్మీయంగా పలకరించి సన్మానించారు. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసేందుకు పనిచేసిన అధికారులు, ఉద్యోగాలు, జల వనరుల శాఖ మంత్రి రామానాయుడును సీఎం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పి. నారాయణ, కందుల దుర్గేష్, కొలుసు పార్థసారధి, అనగాని సత్యప్రసాద్, గుమ్మిడి సంధ్యారాణి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి సహా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ దృశ్యాలు























## జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్ పై సీఆర్డీఏ కు తగిన ఆదేశాలు

### మంత్రివర్గ ఉపసంఘం ముందుకూ ప్రతిపాదన: సురేష్ కుమార్



**అమరావతి,కలంకౌంటర్ :** అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌పై ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ప్రభుత్వం తరఫున వెంటనే సీఆర్‌డీఏ కమిషనర్‌కు తగిన ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. అంతేకాకుండా జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించిన అంశాన్ని ప్రభుత్వంలో సంబంధిత మంత్రివర్గ ఉప సంఘం ముందుంచి తదుపరి చర్యలకు మార్గం సుగమం చేస్తామని స్పష్టం చేశారు. వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు సోమవారం సురేష్ కుమార్‌ను కలిసి, సుప్రీంకోర్టు మాజీ రిజిస్ట్రార్ జనరల్ నుంచి పొందిన న్యాయ నిపుణుల అభిప్రాయాన్ని సమర్పించారు. జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించిన న్యాయపరమైన, విధానపరమైన అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సుప్రీంకోర్టు మాజీ రిజిస్ట్రార్ జనరల్ ఇచ్చిన లీగల్ ఒపీనియన్‌ను అనుసరించి సొసైటీ సభ్యులకు గృహ నిర్మాణం చేపట్టేందుకు ఎలాంటి న్యాయపరమైన అడ్డంకులు లేవని వివరించారు. సొసైటీ ప్రతినిధుల వాదనలను సావధానంగా విన్న ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ సానుకూలంగా స్పందించారు. ఈ అంశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం నుంచి అవసరమైన చర్యలు తీసుకుంటామని, సీఆర్‌డీఏ కమిషనర్‌కు వెంటనే ఈ విషయంపై మెమో పంపిస్తామని తెలిపారు. అనంతరం హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించిన ప్రతిపాదనను మంత్రివర్గ ఉప సంఘం ముందుంచి, ప్రభుత్వ స్థాయిలో అవసరమైన నిర్ణయాలు తీసుకునేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ప్రభుత్వం గతంలో జారీచేసిన జిఓ ఎంఎస్ నంబర్ 107 విధివిధానాలను స్పష్టం చేసిందని, దాని అమలుకు సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరోవైపు ఐ అండ్ పీఆర్ కమిషనర్ విశ్వనాథన్ ను సైతం సంఘం ప్రతినిధులు కలిశారు. అమరావతి రాజధాని నిర్మాణంతో పాటు జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన పెండింగ్ అంశాలను కూడా పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఈ సందర్భంగా విశ్వనాథన్ తెలిపారు. జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌పై సొసైటీ సమర్పించిన న్యాయపరమైన అభిప్రాయం స్పష్టంగా ఉందని, సంబంధిత శాఖలు, అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్తామని చెప్పారు. లీగల్ ఒపీనియన్ పరంగా పరిశీలించినప్పుడు అమరావతిలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల రీత్యా గతంలో ప్రభుత్వం ఇచ్చిన జిఓ అమలుకు ఎటువంటి అడ్డంకి లేదని తెలిపారు. సుదీర్ఘకాలంగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌పై ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ , ఐపీఆర్ కమిషనర్ విశ్వనాథన్ స్పష్టమైన హామీ ఇవ్వడం పట్ల సొసైటీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి సీఆర్‌డీఏ కమిషనర్‌కు మెమో పంపడం, అనంతరం మంత్రి వర్గ ఉప సంఘం ముందుకు అంశాన్ని తీసుకెళ్లే ప్రక్రియ ప్రారంభం కానుండటంతో ఈ స్కీమ్‌కు త్వరలోనే పరిష్కారం లభిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి పాటిబండ్ల నాగ శ్రీనివాస్, వ్యవస్థాపక కార్యదర్శి చావా రవి, ది పయనీర్ చీఫ్ ఆఫ్ బ్యూరో డాక్టర్ రవి కుమార్ బొప్పన, ది హిందూ డిప్యూటీ ఎడిటర్ శ్రీనాథ్, ఆంధ్ర ప్రభ చీఫ్ ఆఫ్ బ్యూరో నేరెళ్లకుంట గోపి పాల్గొన్నారు.

## అమరావతి ఛాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారుల సత్తా 13 స్వర్ణం, 12 రజత పతకాలు కైవసం

- పతక విజేతలను అభినందించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ
- మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్ష



**విజయవాడ, కలంకౌంటర్ :** రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఎన్‌టీఆర్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరుస్తూ పతకాలు సాధించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. క్రీడల్లో ప్రతిభను నిరూపించుకునేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ వేదికలు, శిక్షణ, ప్రోత్సాహకాలు, వనరులను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని క్రీడాకారులకు సూచించారు. 2026, ఆగస్టు 24 నుంచి 27వ తేదీ వరకు తిరుపతిలో నిర్వహించిన అమరావతి స్టేట్ లెవల్ ఛాంపియన్‌షిప్‌లో ఎన్‌టీఆర్ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలోని క్రీడాకారులు వివిధ క్రీడాంశాల్లో పాల్గొని స్వర్ణ, రజత పతకాలు సాధించారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, యోగా విభాగాల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం పట్ల జిల్లా కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. పతకాలు సాధించిన క్రీడాకారులను సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించాలంటే ప్రతిభతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన ఎంతో ముఖ్యమని.. రాష్ట్రస్థాయి పోటీల్లో సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె.కోటేశ్వరరావు, కోచ్‌లు భాస్కర్ (బ్యాడ్మింటన్), నవీన్ కుమార్ (ఆర్చరీ), స్వామి (వెయిట్ లిఫ్టింగ్), ఇషాక్, చిరంజీవి (బాక్సింగ్), సంతోష్ (బాస్కెట్ బాల్), ఆంజనేయులు, శిరీష (యోగా), క్రీడాకారులు పాల్గొన్నారు.



# సత్కారం...





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** వైస్సార్సీపీ రాష్ట్ర పదవులు దక్కించుకున్న కృష్ణాజిల్లా నాయకులు గూడూరు మండల ఎంపీపీ సంగా. మధుసూదనరావు రాష్ట్ర బూత్ కమిటీల విభాగం ఉపాధ్యక్షులు గా, మాజీ స్టేట్ ఫైనాన్స్ డైరెక్టర్ కారుమంచి. కామేశ్వరరావు రాష్ట్ర ఎస్ సి సెల్ ప్రధాన కార్యదర్శి గా నియమితులైన సందర్బంగా మాజీ మంత్రి పేర్ని. వెంకట్రామయ్య (నాని ) ఘనంగా సత్కరించారు.

# బ్యాంకింగ్ రంగంలో రవీంద్ర బాబు సేవలు చిరస్మరణీయం..






**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఆంధ్రాబ్యాంక్ ఎంప్లాయిస్ కోపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ లో 36 సంవత్సరాలు సుదీర్ఘ సేవలు అందించిన రావుల రవీంద్రబాబు చిరస్మరణీయమని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అన్నారు. రవీంద్రబాబు పదవీ విరమణ సందర్భంగా సోమవారం బ్యాంకు ప్రాంగణంలో మేనేజర్ సిబ్బంది కస్టమర్ల సంయుక్త సమావేశంలో ఘనంగా వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాలాజీ మాట్లాడుతూ రవీంద్రబాబు సుదీర్ఘ పదవీకాలంలో కస్టమర్లకు అందుబాటులో ఉంది కస్టమర్ల మన్ననలు పొందారని అన్నారు. హైదరాబాదు, రాజమండ్రి, మచిలీపట్నం బ్రాంచ్ లలో లో ఆయన అందించిన సేవలు మరువ లేనివని అని అన్నారు. బ్రాంచ్ మేనేజర్ ఎం సోమశేఖర్ మాట్లాడుతూ రవీంద్రబాబు తన పదవీకాలంలో ఉన్న అధికారుల మందనాలు పొందాలని అన్నారు ఎంతో అనుభవం కలిగిన రవీంద్రబాబు పదవీ విరమణ బ్యాంకింగ్ రంగనానికి తీరని లోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో లంకిశెట్టి హరనాథ్ బాబు బ్యాంకు సిబ్బంది పాలుగున్నారు

# ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి.

● కృష్ణా జిల్లా కలెక్టర్ కు ఏపీ జెఎసి అమరావతి కృష్ణాజిల్లా నాయకత్వం ఉద్యమ నోటీసు అందజేత ● ఈరోజు ఉద్యమ కార్యచరణలో భాగంగా కృష్ణా జిల్లా కలెక్టర్ కి ఉద్యమ నోటీస్ అందించిన కృష్ణాజిల్లా ఏపీ అమరావతి నాయకులు.



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఉద్యోగులకు రావలసిన పెండింగ్ డిఏలు విడుదల చేయాలని, పే రీవిజన్ ఆలస్యం అవుతున్న నేపథ్యంలో ఉద్యోగులపై పెరుగుతున్న ఆర్థిక భారాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణమే ఐ. ఆర్ మంజూరు చేయాలని, పి ఆర్ సి కమిషనర్ ను నియమించి 12 వ పి ఆర్ సి ప్రకటించాలి అని, వేలకోట్ల బకాయిలను చెల్లించి పెండింగ్ బకాయిలను ఉద్యోగుల పేస్లిప్ లో నమోదు చేయాలని, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు ూూూ, రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ ను గతంలో మాదిరి 10% మరియు 15% ఇవ్వాలి అని, కాంట్రాక్ట్ ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలి, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఎ= పాలసీ అమలు చేసి, ప్రభుత్వ పథకాలు వర్తింప చేయాలని అను ప్రధాన డిమాండ్లతో కూడిన నోటీస్ గౌరవ కృష్ణా జిల్లా కలెక్టర్ గారికి అందించడం జరిగింది. ఉద్యోగుల హక్కుల కోసం నిజాయితీగా పోరాడుతున్న ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమ కార్యాచరణను ప్రతి ఉద్యోగి పాటించాలని ఏపీ జేఏసీ అమరావతి కృష్ణాజిల్లా నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిజేసి అమరావతి రాష్ట్ర కోశాధికారి నాగేశ్వరరావు , జిల్లా చైర్మన్ వీ శ్యామ్ నాథ్, సెక్రటరీ జనరల్ వైవీ రావు , APRSA జిల్లా అధ్యక్షులు పేపేటి సత్యనారాయణ, ఏపీ +ఔజుఔ జిల్లా అధ్యక్షులు G గోపిచంద్, మున్సిపల్ ఎంప్లాయిస్ రాష్ట్ర నాయకులు గోపాల్ మరియు ఏపీ జేఏసీ అమరావతి అనుబంధం సంఘ నాయకులు పాల్గొన్నారు.

# వెలుగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు,కలంకౌంటర్ :** మార్కాపురం జిల్లాలోని పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా సోమవారం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా మంత్రులు, ఎంపీ, సహచర శాసనసభ్యులతో కలిసి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ.... నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న మార్కాపురం, ప్రకాశం జిల్లాల ప్రజలకు శాశ్వత ఉపశమనం కలిగేలా చంద్రబాబు సారథ్యంలో వెలిగొండ ప్రాజెక్ట్ రూపుదిద్దుకున్నదని తెలిపారు. సుమారు 4.5 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి త్రాగునీరు అందించే ఈ ప్రాజెక్టుకు 1996లో చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన చేశారని, తిరిగి ఆయన చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో ప్రాజెక్టు నిర్మాణంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోగా, అంతా తానే చేసినట్లు జగన్ చెప్పుకోవటం విడ్డూరంగా ఉందని నాగేశ్వరరావు అన్నారు. మూడు దశాబ్దాల ప్రజల ఎదురుచూపులు ఫలించాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు వేగంగా పూర్తిచేసి మొదటి ఫేజ్ పనులను సోమవారం ప్రారంభించడం జరిగిందన్నారు. కందుకూరు ప్రాంతంలోని రాళ్లపాడు రిజర్వాయర్, పాలేరు నదికి కూడా వెలిగొండ ప్రాజెక్టు నుంచి కృష్ణా జలాలను తీసుకువచ్చే ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. రైతుల కోసం ఒక్కొక్క సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేస్తూ, చంద్రబాబు నాయుడు అపర భగీరధురడిలా మారారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కొనియాడారు.

# బీసీ విద్యార్థుల సంక్షేమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పెద్దపీట

● మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవతో 356 మందికి హాస్టల్ ప్రవేశాలు

● 12 బీసీ వసతి గృహాల్లో 120 మంది బాలికలు, 236 మంది బాలురకు కొత్తగా అవకాశం



**కోటబొమ్మాళి,కలంకౌంటర్ :** పేద, మధ్యతరగతి బీసీ విద్యార్థుల విద్యాభ్యాసానికి మరింత ప్రోత్సాహం అందించడంతో పాటు, వారికి నాణ్యమైన వసతి, విద్యా సౌకర్యాలు అందించాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవతో టెక్కలి డివిజన్ పరిధిలోని 12 బీసీ వసతి గృహాల్లో 2026-2027 విద్యా విద్యా సంవత్సరానికి 356 మంది విద్యార్థిని, విద్యార్థులకు నూతనంగా ప్రవేశాలు కల్పించారు. సోమవారం నిమ్మాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బీసీ వసతి గృహాల అడ్వైజరీ కమిటీ చైర్మన్, రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్కలి డివిజన్ పరిధిలోని బీసీ వసతి గృహాల్లో విద్యార్థుల ప్రవేశాలపై సమీక్షించి, అర్హులైన విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయంతో మొత్తం 356 మంది విద్యార్థులకు హాస్టల్‌లో కొత్తగా ప్రవేశాలు లభించాయి. వీరిలో 120 మంది బాలికలు, 236 మంది బాలురు ఉన్నారు. దీంతో గ్రామీణ, పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు తమ స్వగ్రామాలకు దూరంగా చదువుకునే సమయంలో వసతి, భోజనం తదితర సౌకర్యాలు అందుబాటులోకి వచ్చి, వారి చదువుకు ఆర్థిక భారం తగ్గే అవకాశం కలుగుతుంది. విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే బలమైన పునాది అని, పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. బీసీ విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు, సురక్షితమైన వసతి, అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన వాతావ- ణం, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటికి తక్షణ పరిష్కారం చూపాలని సూచించారు. బీసీ విద్యార్థులకు విద్యా అవకాశాలను విస్తరించడం ద్వారా వారి ఉన్నత విద్యకు, భవిష్యత్‌లో మెరుగైన ఉపాధి అవకాశాలకు ప్రభుత్వం బాటలు వేస్తోందని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమం, వారి ఉజ్వల భవిష్యత్తే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టెక్కలి సహాయ బీసీ సంక్షేమాధికారి, సంబంధిత బీసీ వసతి గృహాల సంక్షేమాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పటిష్ట బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిన ముఖ్యమంత్రి పర్యటన

---ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు



**ద్వార్నాల,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దోర్నాల మండలం, గంటావానిపాలెం వద్ద వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేశారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్ వద్ద గుంటూరు రేంజ్ ఐ.జీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, ఐ.పి.ఎస్, మార్కాపురం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు బందోబస్తు ఏర్పాటులను పరిశీలించారు. దోర్నాల మండలం గంటవానిపల్లి వద్ద ముఖ్యమంత్రి జలహారతి, పైలాన్ ఆవిష్కరించి, గేట్లు ద్వారా నీటిని విడుదల చేసి, ప్రజావేదికలో ముఖ్యమంత్రి పాల్గొని, అనంతరం విజయవంతంగా పర్యటనను ముగించి బయలుదేరారు. పర్యటనకు ముందు, హెలిప్యాడ్, వి.ఐ.పి. రూట్, హెలికాప్టర్ దిగే హెలిప్యాడ్ ప్రాంతం నుండి జల హారతి జరిగే ప్రదేశం,పైలన్, గేట్లు,ప్రజావేదిక ప్రదేశం మరియు పార్కింగ్ ప్రాంతాలను గుంటూరు రేంజ్ ఐ.జీ, జిల్లా ఎస్పీ సందర్శించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. బందోబస్తు విజయవంతంగా పూర్తి చేసినందుకు జలహారతి,ప్రజా వేదిక, రూట్, ట్రాఫిక్, బందోబస్తు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. పటిష్టమైన ప్రణాళికను రూపొందించుకుని విధులను నిర్వర్తిస్తే, ఏ కార్యక్రమం అయిన విజయవంతంగా నిర్వహించగలమని పేర్కొన్నారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటన విజయవంతమైందని తెలిపారు. పర్యటనను విజయవంతంగా నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ అభినందనలు తెలియజేసి, అలాగే సహకరించిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులకు సిబ్బందికి ఎస్పి ధన్యవాదాలు తెలిపారు.



Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com